క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని వేప చెట్టు సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఆర్ఎస్ నాయకుడు బాలసాని వేణు చేతుల మీదుగా వేల్పూరి కృష్ణయ్య శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కోట మల్లిఖార్జునరావు, వేల్పూరి లక్ష్మీనారాయణ, వేల్పూరి శ్రీను, మడగూరి శ్రీను, మద్దుకూరి నెహ్రూ, కలకోట సంతోశ్, వేల్పూరి రాజేశ్, రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఏటూరునాగారం : ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ, మెడికల్, ఇతర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు టీవీ.వీరభద్రం శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగు డీఏల బకాయిలు ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సి తెలిపారు. ఐదేళ్లుగా ఉపాధ్యాయుల బదిలీలు, ఎనిమిదేళ్లుగా పదోన్నతులు పెండింగ్‌లోనే ఉన్నాయని వివరించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు.

కోటంచలో ప్రత్యేక పూజలు



కోటంచలో బారులుదీరిన భక్తులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని సుప్రసిద్ధ శ్రీకోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భోగి పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రబంధ అధ్యాయనం, పరమపదోత్సవం, అర్చనలు, మొక్కుబడి సేవలను నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సిరికొండ రామారావు–మంజుల దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైద్యశిబిరం..

కోటంచ ఆలయంలో శ్రీసాయిరతన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాదాడి అనిత కరుణాకర్‌రెడ్డి, ఈఓ బిల్ల శ్రీనివాస్, సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్‌రావు, ఉప సర్పంచ్ శ్రీరాములు మహేందర్, ఆలయ ధర్మకర్తలు కుమారస్వామి, రాజేశ్వర్‌రావు, భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ



క్రీడాకారులతో కానిస్టేబుల్ నర్మల్‌సింగ్

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామంలోని 15మంది వాలీబాల్ క్రీడాకారులకు శనివారం పెగడపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బోడ నర్మల్‌సింగ్ టీషర్టులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఎస్సై నరేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మల్హర్ : కొయ్యూరు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నరేశ్‌ను బీజేపీ అనుబంధ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండం మల్లారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు అజ్మీరా నవీన్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లావుడ్యా శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు అజ్మీరా శివ, భూక్యా ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా భోగి వేడుకలు

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఊరూరా భోగి వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రాల్లో, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సర్పంచ్‌లు, యువజన సంఘాల ఆధ్వర్యంలో భోగి మంటలు ఏర్పాటు చేశారు. పల్లెల్లో తెల్లవారుజాము నుంచే పండుగ సందడి నెలకొంది. జనం రేగు పళ్లు వేసి కాచిన నీటితో స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి సందడి చేశారు. మహిళలు ఇళ్ల ఎదుట తెల్లవారకముందే రంగురంగుల ముగ్గులు వేశారు. పిండి వంటలు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారం : రంగులతో ముగ్గులు వేస్తున్న మహిళలు



వెంకటాపురం (కె)లో భోగి మంటలు



వాజేడులో..



వెంకటాపురం (ఎం) : విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ సుచరిత, నాయకులు



ములుగు రూరల్ : బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ సరస్వతి

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని రామాలయం వద్ద కమిటీ చైర్మన్ మోడెం రమేశ్ ఆధ్వర్యంలో, బొడ్రాయి వద్ద బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో భోగి మంటలు ఏర్పాటు చేశారు.

వెంకటాపురం (ఎం) : మండలంలోని నల్లగుంటలో బీజేపీ అనుబంధ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గడ్డం శోభ ప్రథమ, రెడ్డి స్రవంతి ద్వితీయ, చిర్ర శిరీష తృతీయ బహుమతులు గెల్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మండల సుచరిత శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. రంగవల్లులు సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, మహిళా మోర్చా అధ్యక్షురాలు తంగెళ్లపల్లి శ్రీలత, సీనియర్ నాయకులు మండల వెంకటరమణారెడ్డి, కారుపోతుల యాదగిరి, కృష్ణాకర్‌రావు, రవీంద్రచారి, విశ్వనాథ్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ములుగు రూరల్ : ములుగు మండలంలోని సర్వాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గన్నగూడెం, లాలాయిగూడెం, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీల్లోని ప్రధాన కూడళ్లలో అధ్యక్షులు గుండెబోయిన శ్రీహరి, జాఫర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి మొత్తం 60 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేయగా బాగె అర్చన ప్రథమ, గంప అహల్య ద్వితీయ, మంకిడి అనూశ తృతీయ, పెనుక సుజాత నాల్గో బహుమతి అందుకున్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ సర్వాపూర్ ఎంపీటీసీ ఈక సరస్వతి చేతుల మీదుగా టిఫిన్ బాక్సులు బహూకరించారు. కార్యక్రమంలో సర్వాపూర్ సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, కృష్ణ, రవి, రవిగౌడ్, అప్పాజీ, ఐలయ్య, పంజాల తిరుపతిగౌడ్, దోబ శారద, తిరుపతి, కృష్ణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వాజేడు : మండలంలోని పూసూరులో వాలీబాల్ పోటీలు, కొంగాలలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు.

వెంకటాపురం (కె) : మండలంలోని వీఆర్‌కే పురంలో సర్పంచ్ పూనెం శ్రీదేవి ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డర్రా దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ



వెంకటాపురం (కె) : దుస్తులు పంపిణీ చేస్తున్న మోహన్‌రావు, ఇతరులు



ఏటూరునాగారం : గండెంగవాయిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న రఘు, ఇతరులు



వెంకటాపురం (ఎం) : గిరిజనులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న శ్రీనివాస్

వెంకటాపురం (కె) : వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, అతడి సోదరుడు సైదబాబు ఆధ్వర్యంలో మరో సోదరుడు కరీమ్ జ్ఞాపకార్థం మండలంలోని పాత్రాపురం గ్రామంలోని పేద కుటుంబాల్లోని వృద్ధులకు, పిల్లలకు వెంకటాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు చేతుల మీదుగా శనివారం బట్టలు, రగ్గులు పంపిణీ చేశారు. సర్పంచ్ కృష్ణార్జునరావు, ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీతదేవి, కాంగ్రెస్ నాయకులు మన్నెం సునీల్, చిడెం శివ, పార్థసారథి, గ్రేస్ హోమ్ నిర్వాహకురాలు కారం రాధ, పాస్టర్ బొగ్గుల రాజు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : మండలంలోని గుండెంగవాయి, ముళ్లకట్ట గ్రామాల్లోని పేదలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సీతక్క సహకారంతో దుప్పట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఖలీల్, వావిలాల నర్సింహారావు, వావిలాల చిన్న ఎల్లయ్య, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, పోశయ్య, సోదారి రామయ్య, హరీశ్, ముత్తేశ్, వెంకటనారాయణ, అర్జున్, శ్రీకాంత్, రంజిత్, భిక్షపతి, మోహన్, సత్యం, చిట్టిబాబు, రమేశ్ పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ

వెంకటాపురం (ఎం) : మండలంలోని అందుగులమేది గ్రామంలోని 60 గిరిజన కుటుంబాలకు బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యుడు ఎం.శ్రీనివాస్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా పేద గిరిజనులకు సరుకులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సేద సారంగం, సభ్యులు సూర్యప్రకాశ్, కిరణ్ పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

కాటారం : కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల నమోదైన రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో ఓ మహిళపై హత్యాచారయత్నం, హత్యాయత్నానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన చిర్ర సాయికుమార్‌ను చింతకాని క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై చెప్పారు. అలాగే మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో షబానా అనే వివాహితను కత్తితో పొడిచి ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డ ఆమె భర్త రియాజ్‌ను మండల కేంద్రంలోని కాళేశ్వరం వైపు గల ఆటోస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్ తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

16 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

మహాముత్తారం: పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18న మండలంలోని పెగడపల్లి గ్రామంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు బాలాజీ, జైపాల్‌నాయక్, జగపతినాయక్‌లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండవ బహుమతిగా రూ.3వేలు, మూడవ బహుమతిగా రూ.2వేలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఎంట్రీ ఫీజ్ రూ.500 చెల్లించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 77026 87776, 63052 78886, 96189 80152 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ఏటూరునాగారం : ముళ్లకట్టలో యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న రఘు, నాయకులు



వాజేడు : వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బుల్లెమ్మ, ఇతరులు

ఏటూరునాగారం : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. మండలంలోని ముళ్లకట్ట, గుర్రంపేట గ్రామాల్లోని యువతకు పార్టీ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు ఆయన శనివారం అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. గెలుపు ఓటములు సహజమన్నారు. యువకులు క్రీడల్లో రాణించడంతోపాటు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసంక్షేమానికి బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, ఖలీల్, ఎల్లయ్య, నర్సింగరావు, రామయ్య పాల్గొన్నారు.

వాజేడు : మాజీ సర్పంచ్ కారం బుల్లెమ్మ చేతుల మీదుగా గ్రామ పెద్దల సమక్షంలో మండలంలోని గుమ్మడిదొడ్డి, సుందరయ్య కాలనీ యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బుల్లెమ్మ మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బందారి సోమరాజు, జయరామ్, ప్రసాద్, చంద్రయ్య, సమ్మయ్య, కొండయ్య, అంజిబాబు, కృష్ణవేణి, జవహర్, సమ్మయ్య, బాబూరావు, ప్రమీల, సునీత పాల్గొన్నారు.

‘వేదామృతం’ను వ్యతిరేకించడం సరికాదు



మాట్లాడుతున్న పులి నర్సయ్యగౌడ్

ఎస్ఎస్ తాడ్వాయి : నీరాకు వేదామృతం పేరు పెట్టడాన్ని బ్రాహ్మణులు వ్యతిరేకించడం సరికాదని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్యగౌడ్ అన్నారు. మండలంలోని కాటాపూర్‌లోని తాటివనంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద శనివారం నిర్వహించిన గీత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటి వృక్షాల నుంచి వచ్చిన తాళ పత్రాల మీదే వేదాలు రచించారన్న విషయాన్ని గ్రహించాలని బ్రాహ్మణులకు సూచించారు. సురాపానం అంటే దేవతలు సేవించే పానీయమని, నీరా తర్వాత వచ్చే కల్లుకు ఆ పేరు ఉందని అనేక గ్రంథాల్లో రాసి ఉందని చెప్పారు. గౌడ కులస్తుల జీవనోపాధికి ఆటంకం కలిగిస్తే ఊరుకోబోమన్నారు. బ్రాహ్మణుల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి పేరును తొలగిస్తే గౌడ కులస్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మళ్ల సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యుడు పాలకుర్తి రవీందర్, ముస్తాదార్ గడ్డం శ్రీధర్, నాయకులు పాలకుర్తి బాబు, గండు సదయ్య, రంగు లాలయ్య, ఉపేందర్, దుర్గస్వామి, గడ్డం సురేశ్, గణేశ్, గడ్డం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

1001 రకం ధాన్యాన్ని కొనాలి



మాట్లాడుతున్న సాదారి రామయ్య

ఏటూరునాగారం : జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో 1001 రకం ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సాదారి రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రొయ్యూర్ గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1001 రకం ధాన్యాన్ని ఇప్పటికే రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగా నిర్వాహకులు కొనడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో 1001 రకం ధాన్యాన్ని కొనేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు ఎల్లయ్య, ఖలీల్, నర్సింగరావు, ముత్తేశ్, దేవేందర్, పోశయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

టేకుమట్ల: పురుగుల మందు తాగి గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కుందనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కుందనపల్లి గ్రామానికి చెందిన అనుముల నిర్మల(42) అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు.

ఆర్థికసాయం

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన ఎలవేన చంద్రు ఇల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. దీంతో శనివారం వర్తక సంఘం అధ్యక్షుడు బొడ్డు సదానందం ఆధ్వర్యంలో శనివారం రూ.25,021 నగదుతోపాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట వర్తక సంఘం నాయకులు ఖాదర్‌మొయినోద్దీన్, రాజేందర్, వంగ నరేశ్, సరోత్తంరెడ్డి, మండల రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే, పలువురి రాక

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లిలో నేడు (ఆదివారం) సంక్రాంతి సంబురాలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ పువ్వాటి రాణివెంకన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబురాలకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, సినీ గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్, సినీ కమేడియన్ రచ్చ రవి, మన ఊరు–మన బడి పథకం మూలాధారం తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి దంపతులు హాజరు కానున్నట్లు తెలిపారు. మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భూమిపూజ

కాటారం : నియోజకవర్గ అభివృద్ధి నిధుల ద్వారా మండలంలోని సబ్‌స్టేషన్‌పల్లి గ్రామ సమీపంలో నిర్మించనున్న మోడల్ బస్‌షెల్టర్‌కు ఎంపీపీ పంతకాని సమ్మయ్య శనివారం భూమిపూజ చేశారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కృషితో మోడల్ బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బస్టాండ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చూస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో చిద్నెపల్లి ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, వార్డు సభ్యుడు కొట్టె శ్రీహరి, కాంగ్రెస్ యూత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కదారి విక్రమ్, రాజబాబు పాల్గొన్నారు.

పచ్చదనమే లక్ష్యంగా..

- గ్రామ పంచాయతీల్లో ప్రారంభమైన మొక్కల పెంపకం
- హరితహారం టార్గెట్ 2.40 లక్షల మొక్కలు
- ఒక్కో జీపీకి ఒక్కో నర్సరీ చొప్పున ఏర్పాటు
- పలు రకాల మొక్కలు పెంచేలా ప్రణాళిక

గ్రామాల్లో పచ్చదనమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే 8 విడతలు పూర్తి చేసుకుని ఈ ఏడాది జూన్‌లో తొమ్మిదో విడత నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకానికి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

-కాటారం



నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నర్సరీలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పల్లెలను పచ్చని వనాలుగా మార్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా మండలంలో విరివిరిగా మొక్కల పెంపకం చేపట్టనున్నారు. జూన్‌లో ప్రారంభమయ్యే హరితహారం కోసం మండలంలో ముందస్తు మొక్కల పెంపకం చర్యలు చేపడుతున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామపంచాయతీకి ఒక్కో నర్సరీ ఏర్పాటు చేసి పలు రకాల మొక్కలను పెంచేలా ప్రణాళిక రూపొందించారు.


టార్గెట్ 2.40 లక్షలు

మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలు ఉండగా వాటి పరిధిలో 36 గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో కలుపుకొని రానున్న తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా 2.40 లక్షల మొక్కలు పెంచాలనే లక్ష్యంతో అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక్కో నర్సరీ చొప్పున ఏర్పాటు చేసి అన్ని నర్సరీల్లో 10 వేలు చొప్పున మొక్కలు పెంచడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో నర్సరీ పనులను మొదలు పెట్టి బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు నాటడం లాంటి ప్రక్రియను పూర్తి చేయించారు. ఉపాధిహామీ పథకం ద్వారా రెగ్యులర్ చేసే పనులు లేవలింగ్, పాటుకాల్వలు శుభ్రపర్చడం, కందకాలు తవ్వడం లాంటి పనులను పక్కన పెట్టి గ్రామాల్లో నర్సరీ పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. అధికారులు నిత్యం పనులను పరిశీలిస్తూ నర్సరీ ఏర్పాటుపై పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

పలు రకాల మొక్కలు పెంచేలా ఏర్పాట్లు..

తొమ్మిదవ విడత హరితహారం కోసం ఆయా నర్సరీల్లో బొప్పాయి, జామ, ఉసిరి, చీమతంగేడు, టేకు, వేప, కానుగ, దురిసే, పలు రకాల పూలు, పండ్ల జాతుల మొక్కలకు సంబంధించిన విత్తనాలు నాటారు. నర్సరీలలో అధిక మొత్తంలో ప్రజలకు ఉపయోగపడేలా మొక్కలు పెంచుతుండటంతో ప్రజలు మక్కువ చూపనున్నారు.

ప్రణాళికతో ముందుకెళ్తున్నాం..



లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ ద్వారా నర్సరీలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే ప్రతి నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేసి విత్తనాలు నాటుతున్నారు. రైతులు, ప్రజలకు ఉపయోగపడే పలు రకాల మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉంచేలా ప్రయత్నిస్తున్నాం.

- వెంకన్న, ఏపీఓ, కాటారం